# " అమృత హస్తం"

వెన్నెల స్మారక మందిరం ప్రారంభోత్సవం పెద్ద పెద్ద బ్యానర్స్ కట్టి వున్నాయి. ఆ మందిరం చూస్తుంటే పండు వెన్నెల చూస్తున్న అనుభూతి. తెల్లని భవనం-ఇంద్రభవనం అని చెప్తారు. బహుశా ఇలాగే వుంటుందేమోననిపిస్తుంది. తెల్లని కిటికీలు, గుమ్మాలు, తలుపులు, అద్దాలు అన్నీ తెలుపే. మెరుగుపెట్టిన పాలరాయితో నిర్మితమైంది. భవనమంతా రాత్రి వేళల్లో లైట్లు వెలిగితే, దూరంనుండి ఆ భవనం తెల్లని భవనం బొమ్మ నిలబెట్టినట్లుంటుందేమో.

ఆ భవన నిర్మాత మూర్తిగారు. ఆ ఊళ్ళో ఒక ప్రభుత్వ ఆఫీసర్‌గా పనిచేసి ఐదేళ్ళ క్రితం ఆయన పదవీ విరమణ చేశారు.

ఆ రోజు - ఆ మందిర ప్రారంభోత్సవానికి ప్రముఖుల నెవరినీ పిలవలేదు. స్థానిక ముఖ్యులనే పిలిచారు.

సభ ప్రారంభమైంది.

" వెన్నెల ప్రారంభోత్సవానికి వచ్చిన సహృదయులందరికీ స్వాగతం. ఈ ఊరి రామకృష్ణ మిషన్ అధికారి రామానంద్ గార్ని అధ్యక్షత వహించవలసిందిగా కోరుతున్నాం.

ఈ స్మారక మందిర నిర్మాత మూర్తి గారిని సతీసమేతంగా వేదిక నలంకరించవలసినదిగా కోరుతున్నాం. ఇక సభ ప్రారంభమవుతుంది " అంటూ సభా నిర్వాహకులు కూర్చున్నారు సభలో.

రామకృష్ణ రామానంద గారు లేచి నిలబడి

" సభకు నమస్కారం ఈ రోజు ప్రారంభించబోయే భవనం మామూలు భవనం

కాదు. అమ్మ మందిరం ఏమిటని విస్తుపోతున్నారా? అమ్మ-మాతృమూర్తి - లేకపోతే మీరు, నేనూ లేము. ఈ సృష్టి చరాచర ప్రపంచం లేదు - ఏమీ లేదు.

కాని - అమ్మను అమ్మగా, అమ్మను దేవతగా, అమ్మకు సమున్నతమైన స్థానం ఇస్తూ, పూజనీయంగా చూసే మగాళ్ళు ఎంతమంది ఉన్నారు ఈ లోకంలో నేను ఈ ప్రశ్నకు సూటిగా సమాధానం చెప్పలేను. ఆకలి, ఆప్యాయత, అనురాగం, ఆవేశం, ఆపేక్ష, ఆవేదన, ఆక్రోశం మూర్తీభవించిన దేవత అమ్మ-తల్లికోసం దేవాలయం కట్టారా ఎవరైనా? మాతృమూర్తిని దేవతగా ఆరాధించారా ఎవరైనా.

మన ఊళ్ళో మూర్తిగారు తన మాతృమూర్తి కోసం ఒక మాతృమందిరం కట్టించారు. అదే - నేటి వెన్నెల స్మారక మందిరం.

కన్నతల్లికి ఎవరూ ఋణం తీర్చుకోలేదుకాని మూర్తిగారు కొద్దిశాతం అయినా ఋణం తీర్చుకోడానికి ప్రయత్నించారు.

భగవంతుడు ఆయన మొర ఆలకించి మరుజన్మలో 'మాతృప్రేమ'ను ఆయనకు అనుగ్రహించాలని కోరుకుంటూ, మూర్తిగారిని రెండు మాటలు మాట్లాడమని అర్థిస్తున్నాను"

తెల్లని లాల్చీ పంచె, పైన కండువా ధరించిన మూర్తిగారు లేచి నిలబడ్డారు.

" మాతృ దేవోభవ." అమ్మ దేవత అంటాను నేను.

" అన్ని జన్మలందు మిన్న ఈ నరజన్మ<br>అమ్మ చలువ నదియె అబ్బె నాకు<br>జన్మ ఋణము తీర జనని సేవించరా " అని ఒక మాతృ భక్తుడు ఉపదేశించాడు - అందుకు.

అమ్మ, తల్లి, మాతృమూర్తి, కన్నతల్లి, చల్లని తల్లి, మాతృదేవత, బంగారు తల్లి, ఎన్ని రకాలుగా చెప్పను అమ్మను. తన కడుపులో తొమ్మిది నెలలు కాపాడి, తన రక్తాన్ని పాలుగా మార్చిచ్చే దేవత. పసిమనసు మొదటిగా చూసేది అమ్మను. పసి మనసు మొదట మాట్లాడే మాట 'అమ్మ'. తన చిరుపాదాలకు గుండెల మీద తన్నినా 'నాన్నా ఏం కావాలి? " అని అంటూ ముద్దులాడే అమ్మ. ఒక అమ్మ స్థానం మరో అమ్మ పూరించలేనిది. ఏ అమ్మకు ఆ అమ్మే సాటి.

షాజహాన్ తన ప్రియురాలి కోసం తాజ్‌మహల్ నిర్మించాడు. అలాగే ఎంతో మంది స్మారక మందిరాలు నిర్మించారు. షాజహాన్ తన తల్లి లేకుండా ఈ భూమి మీదకు ఎలా వచ్చాడు. తల్లిని విస్మరించి, ప్రియురాలికి స్మారక చిహ్నం కట్టించడమా. అంటే తల్లి కన్నా

తల్లి ప్రేమ కన్నా ఎక్కువా? వీటి ఉచితానుచితాల జోలికి నేను వెళ్ళదలచుకోలేదు.

మానవ జీవితంలో సమున్నతమైన స్థానం ఏదైనా ఉంటే అది 'అమ్మ'దేనని నేను అంటాను. ఇది నిర్వివాదాంశం. అందుకే-

నేను అమ్మకోసం ఒక దేవాలయం నిర్మించాను. నాకు దేముళ్ళ కన్నా అమ్మ ఎక్కువ. ఎందుకంటే, దేముణ్ణి చూపించి నమస్కరించమని చెప్పిందెవరు? అమ్మ లేకుండా జన్మ ఎక్కడ వుంది?

తన కడుపులో పెంచి బయటకు వచ్చాక ప్రపంచాన్ని చూపించేది ఆమే. మంచి చూపిస్తే మంచి తెలుస్తుంది. చెడు చూపిస్తే చెడు తెలుస్తుంది. తల్లి మంచే చూపిస్తుంది ఎప్పుడూ అమ్మ ప్రేమ, కన్న ప్రేమ ఒక తీరని ఆకలి, విసుగూ, విరామం లేని అజరామరమైన సముద్రం - నేను (మూర్తిగారి గొంతు పూడుకుపోయింది) ఆ మాతృమూర్తి ప్రేమకోసం పరితపించాను. నా జీవితంలో అది ఒక పెద్ద తీరని కోరిక కన్నా తల్లి ప్రేమ ఒక ఆకలి. ఈ ఆకలి అమ్మ కనిపిస్తేనే తీరేది. ఎవరూ పూడ్చలేనిది ఈ లోటు. అందుకే - ఈ దేవాలయం - పేరు "వెన్నెల" మనశ్శాంతి కరువైన వారికి చల్లని నీడ ఇచ్చి, ' చందమామ ' ప్రసాదించే వెలుగు, ' వెన్నెల 'ను ఈ మందిరానికి పేరు పెట్టాను.

ఈ వెన్నెలలో అనాథ అమ్మలను ఆదరించి నీడ కల్పిస్తుంది ఉచితంగా. ఏ తల్లి అయినా సరే " నాకు దిక్కు లేదు. నేను బాధలో వున్నానంటే ఈ మందిరానికి వచ్చినా కన్నతల్లి బిడ్డను ఒడిలో పెట్టుకున్నట్టుగా ఆదరిస్తుంది. " వెన్నెల " సారథ్యంలో, నేను అనుకున్న ఆశలు, ఆశయాలు నెరవేర్చలేనేమోనన్న ఉద్దేశంతో, ఈ స్మారక మందిరం విషయంలో నేనే ట్రస్టీగా వున్నాను. ఎవరినీ చేర్చుకోలేదు. సహృదయ విరాళాలకు స్వాగతం.

అమ్మ గురించి చివరగా రెండు మాటలు చెప్పి ముగిస్తాను.

నేను అశాంతికి లోనై విచారంగా పడుకుని వున్నాను. ఆ రోజు ఉదయం ఎనిమిదైనా నిద్ర లేవలేదు. ఎవరో తలుపు తీశారు. లేచి వెళ్ళి తలుపు తీశాను.

ఎదురుగా అమ్మ. నా దేవత. కుంకుమ ఎరుపు, పసుపు రంగుల కలనేత చీర. పచ్చని మేని రంగు. గుండ్రని ముఖం. ముఖం నిండా పసుపు. నుదుటి మీద పెద్ద కుంకుమ బొట్టు. అమ్మ కళ్ళల్లో చందమామ వెదజల్లే వెన్నెల కిరణాలు. అసమాన ప్రేమతో నిండిన కరుణార్ద్ర చూపు.

" కన్నా నన్ను లోపలకు రానీయవురా. " అంటూంది నవ్వుతూ. నన్ను ఎప్పుడూ అమ్మ కన్నా అని పిలిచేది.

" అమ్మా " చెయ్యి పట్టుకుని గిల్లాను.

" పిచ్చి నాన్నా ఏమిటీ పనులు? నీ అమ్మనేరా. నీ కోసం వచ్చాను. రాత్రంతా నన్ను తలుచుకుని కుళ్ళి కుళ్ళి ఏడ్చావు కదురా. భార్యా, పిల్లలు, పిల్లల పిల్లలు, అంతులేని సంపద నీకు లోటు ఏమిటి రా. ఈ పిచ్చి అమ్మ ఎందుకురా నాన్నా. " అమ్మ నోటికి చేయి అడ్డం పెట్టాను. అమ్మ లోపలకు వచ్చింది. నా మంచం మీద కూర్చుంది. అమ్మ వొడిలో తల పెట్టుకుని నడుం చుట్టూ చేయి వేసి అమ్మను నా గుండెలకు దగ్గరగా హత్తుకున్నాను.

అమ్మ - నా తల నిమురుతూ, నా గుండెలు నిమురుతూ నాచేతులు సవరిస్తూ, నా కాళ్ళు సున్నితంగా నొక్కుతూ, నా జుట్టు సవరిస్తూ "పిచ్చి కన్నా ఎంత చిక్కిపోయావురా. కర్తవ్యాలు, బాధ్యతలు నెరవేర్చే క్రమంలో నీ ఆరోగ్యం కూడా చూసుకోవాలి నాన్నా. కొవ్వొత్తిలా కరిగిపోతే వెలుగు వుండదు కదా-"

" అవునమ్మా - "

" అయితే ఎందుకు ఇలా అయిపోయావు- "

" అమ్మా - ఎప్పుడూ నువ్వే గుర్తుకు వస్తున్నావే - నువ్వు నన్ను వదలి వెళ్ళిపోయావు, ప్రేమ, ఆప్యాయత, అనురాగం, లాలన, ఆదరణ, అనునయం, అనుబంధం, నేను రుచి చూడలేదమ్మా. దాదాపు అందరూ నన్ను తమ అవసరాలకు వాడుకున్నారే తప్ప, నీలాగ నిష్కల్మషమైన ప్రేమను, ఎవ్వరూ పంచి ఇవ్వలేదమ్మా. ఒక్కసారి అకస్మాత్తుగా ఇవన్నీ వదిలేసి నీ దగ్గరకు వచ్చేయాలనిపిస్తూంది. కాని ఈ లోకంలో నేను ఏర్పరచుకున్న బంధాలు, నా ముందరకాళ్ళకు బంధం వేసి, వెనక్కు లాగేస్తున్నాయి." నా కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. అమ్మ అమృత హస్తాలతో నా రాబోయే కన్నీళ్ళను తుడిచి

" నేను వచ్చేశానుగా, నీకు ఏ లోటూ రానివ్వను. దేముడితో పోట్లాడి నీ కోసం వచ్చేశాను - "

" అమ్మా నిద్ర వస్తోందే. ఇంకాస్సేపు నీ ఒడిలో పడుకుంటాను - " అంటూ ఆమె వేపే చూస్తున్నాను.

ఆమె చూపులలో అదృశ్య శక్తి వుంది.

వశీకరణ శక్తి వుంది. అమ్మ ప్రేమ వుంది.

అమ్మ లాలన వుంది.

ఎన్నో సంవత్సరాల కఠోర తపస్సు చేశాక, ప్రత్యక్షమైన దేముణ్ణి చూస్తున్నట్లుగా

విస్ఫారిత నేత్రాలతో అమ్మను చూస్తున్నాను.

అమ్మ నన్ను జో కొడుతూంది. నేను నిద్రలోకి జారుకున్నాను. చాలా సంవత్సరాలకు అమ్మ ఒడిలో నిద్రపోయే భాగ్యం కలిగింది.

నిద్రలేచాక నాకు తలస్నానం చేయించింది. సాంబ్రాణి పొగ వేయసాగింది. " అమ్మా నేనేమన్నా చిన్న పిల్లాడినా, నాకు సాంబ్రాణి పొగ ఎందుకు ? "

" ఒరేయ్ నీకు ఎంత వయసు వచ్చినా నాకు పసిబిడ్డవేరా– " అంటూ జుట్టు విడదీసి సాంబ్రాణి పొగ జుట్టు లోపలకు వెళ్ళేట్టుగా, నా తలవొంచి పొగ వేయసాగింది.

ఆ తరువాత పెసరట్లు, ఉప్మా.

" నీకోసం జీడిపప్పు ఉప్మా చేశానురా. నీకు పెసరట్టు ఇష్టం కదురా. అందుకోసం పెసరట్లు ఉప్మా చేశాను" అంటూ అమ్మ పెసరట్లలో ఉప్మా నుంచి నోట్లో పెట్టసాగింది.

అమ్మను ప్రేమాభిమానాలతో కూడిన తమకంతో చూస్తున్నాను. " వెధవాయ్. ఏమిటా చూపులు. నేను ఎక్కడ వెళ్ళిపోతానో అన్నట్టుగా నన్ను అలా చూస్తున్నావ్ " అంటూ అమ్మ నన్ను కేకలేసింది.

" అమ్మా నన్ను వదిలి వెళ్ళవు కదా "

" వెళ్ళనురా కన్నా – " అంటోంది అమ్మ చిరునవ్వుతో.

" అమ్మా నాకు మొదటి అమ్మాయి పుట్టినప్పుడు నువ్వు రాలేదు. పోనీ నాకు గుండెపోటు వచ్చింది. అప్పుడైనా రాలేదు. అవునులే నేనే నీ దగ్గరకు వచ్చేస్తానేమోనని రావడం మానేసి వుంటావు. ఒకసారి నాకు యాక్సిడెంట్ అయితే అప్పుడు నిన్ను చూడాలనిపించింది. అమ్మ వచ్చి గాయాల మీద నిమిరితే ఎంత బాగుండును అనిపించేది అప్పుడు. అప్పుడూ రాలేదు. నేను ఈరోజు భార్యా, పిల్లలు, సంపదలతో వున్నానంటే, ఎన్ని బాధలు, ఎన్ని అవమానాలు, ఎన్ని కన్నీళ్లు వృధా అయితేనో, కష్టాలు పడితేనో ఇదంతా జరిగింది. అమ్మా నిన్ను ఇక వదలను " అంటూ అమ్మను పట్టుకుని ఒకటే ఏడ్వసాగేను. కన్నీరు జలపాతంలా అవిశ్రాంతంగా కారుతూంది.

ఆ కన్నీళ్ళలోంచే అమ్మను చూస్తూనే ఉన్నాను. ఎందుకంటే కళ్ళు మూసుకుంటే అమ్మ కమనీయ రూపం కనుమరుగైపోతుందేమోనని భయం. అమ్మ నాకు కళ్ళు తుడుస్తూంది–

" అమ్మా ఒక కోరిక కోరతాను తీరుస్తావా ? "

" నన్ను నీ కూడా తీసుకెళ్ళి పోతావా– " అన్నాను.

"తప్పు బాబూ - తప్పు అలా చిన్న పిల్లాడిలా ఏడుస్తావేంట్రా. నీకు భార్యా పిల్లలు, మనవలు, మనుమరాళ్ళు, చేయాల్సిన శుభకార్యాలు వున్నాయి. అవన్నీ పూర్తిచేసుకుని నా కోసం ఎదురుచూడు నేను వచ్చి నిన్ను తీసుకువెళ్తాను" అంటూ అమ్మ నన్ను జోకొడుతూంది. నేను మత్తులోకి వెళ్ళిపోతున్నాను.

కళ్ళు నులుముకుని చూశాను. ఎదురుగా అమ్మ లేదు. అది ఒక మధుర స్వప్నం. అనురాగ సుధల స్వాప్నిక అవస్థ. వర్ణనాతీతమైన ప్రేమ సాగరంలో తేలియాడాను కొన్ని క్షణాలు అమ్మా-

ఆకలి నీరసాన్ని నంజుకుంటున్నప్పుడు

ఆశలు నిస్పృహలో పుంజుకుంటున్నప్పుడు

మాలిన్యపు చెదలు గుండెలు తినేటప్పుడు

మలిసంజ కోసం జీవం గింజుకునేటప్పుడు

కన్నతల్లి నిండైన కన్నులు స్రవించే

కరుణ కోసం అలమటిస్తాను

ఏడ్పులో ఎక్కిళ్ళు సాయం చేసేటప్పుడు

అనుభవాల స్మశానంలో స్వప్నాలు సమాధులు కట్టుకుంటున్నప్పుడు

చచ్చిపోయిన స్మృతులకు అస్థికలు సైతం మిగలనప్పుడు

విధి గోతిలో భావిని కప్పి పెట్టేటప్పుడు

కన్నతల్లి అమృత స్పర్శ కోసం

నయమయిన వ్యాధిలా అణగారి పోతాను

అభిమానం అవమానపు ఆహ్వానం అందుకుని ఉరికేటప్పుడు

పట్టువదలని దైన్యం పితృకర్మలు జరిపేటప్పుడు

దౌర్భాగ్యం నాలో పరకాయ ప్రవేశం చేసేటప్పుడు

అనునయించే నా తల్లి మందహాసంతో

తల తెగవేసిన మొండెంటా గిలగిలా తన్నుకుంటాను.

ఎంత సహజంగా ఒక కవి వాపోయాడో 'అమ్మకోసం' చూడండి. ఈ సభలో వున్న సహృదయులందరికీ నా విజ్ఞప్తి.

అమ్మను ప్రేమించండి

అమ్మను ఆదరించండి

అమ్మను లాలించండి

అమ్మను బాధించకండి

అమ్మ ప్రేమను తనివితీరా అనుభవించండి

అమ్మ ఒక అనురాగ దేవత

అమ్మ ఒక సజీవ దైవం

అమ్మ దేముడు మనుషులకు ఇచ్చిన అపూర్వమైన కానుక – " మూర్తి గారి కళ్ళవెంబడి కన్నీళ్ళు వర్షిస్తున్నాయి.

రమానంద్‌గారు లేచి మూర్తి గారి భుజాల మీద తట్టి " మూర్తిగారూ, అప్సెట్ అవకండి " అంటూ ఆయన్ను కూర్చోపెట్టారు.

తరువాత మాతృమందిరం వెన్నెల ఆవరణలో మూర్తిగారి మాతృదేవత " సూరమ్మ" గారి పాలరాతి విగ్రహం ఆవిష్కరించబడింది. దాంతో 'వెన్నెల' ప్రారంభమైంది.

అమ్మ విగ్రహానికి మూర్తిగారు పాదాభివందనం చేసి గులాబీల దండవేశారు.

అవును

అమ్మ సజీవదైవం.

***

తెర వెనుక కనిపించే తల్లి ప్రేమకంటే తెర మీద కనిపించే ప్రేమను కోరుకునే యువతీ యువకులకు రచయిత **కె.బి.కృష్ణ గారు** "అమృతహస్తం" ద్వారా మంచి సందేశాన్ని అందించారు.

–బి. ఇందిరా

---

**' అమ్మలందరికీ అనురాగంతో ఈ కథ – ' రచయిత.**